క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భాద్రపద మాసం ప్రారంభంతో శనివారం వైభవంగా అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారు ప్రత్యేక పూలాంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్య స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

6న కలశ పునఃప్రతిష్ట ఉత్సవాలు



మాట్లాడుతున్న ఈఓ శ్రీధర్, చైర్మన్ మార్తల రాజారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబర్ 6న కలశ పునఃప్రతిష్ట ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ మార్తలరాజారెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ నెల రోజుల కిందట కోతులు ఆలయంపై కలశాన్ని కదిలించడంతో రెండు భాగాలు కింద పడ్డాయన్నారు. కిందపడిన భాగాలన్ని ఆలయంలోనే భద్రంగా ఉన్నాయని తెలిపారు. సెప్టెంబర్ 6న ఆలయంలో సంప్రోక్షణ, హోమాలు, అభిషేకాలు నిర్వహించి కలశ పునఃప్రతిష్ట ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

1న గణేష్ నిమజ్జన శోభాయాత్ర

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయక చవితిని పురస్కరించుకుని సెప్టెంబర్ 1న గణేష్ నిమజ్జన శోభాయాత్ర నిర్వహించనున్నట్లు ప్రొద్దుటూరు నగర గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ అధ్యక్షుడు సి.సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు యాదాల రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. 1న మధ్యాహ్నం 2 గంటలకు రామేశ్వరం నుంచి స్టేట్ బ్యాంక్, గాంధీ రోడ్డు, విజయ్‌కుమార్ థియేటర్, రాజీవ్ సర్కిల్, శివాలయం సెంటర్, మైదుకూరు రోడ్డు, రిలయన్స్ పెట్రోలు బంకు, డీమార్ట్ సర్కిల్‌నుండి బైపాస్ ద్వారా కామనూరు కుందూ నది వరకు శోభాయాత్ర సాగుతుందని వివరించారు. కుందూ నదిలో స్వామి వారిని నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. నిమజ్జనం సందర్భంగా కోలాటం, కర్రసాము, చెక్కభజన వంటి సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమజ్జన అనంతరం ఎడిఫై పాఠశాల వద్ద భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. వినాయక ఉత్సవాల మండపాల నిర్వాహకులు, ప్రజలు శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రూరల్ సీఐగా నాగభూషణం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్ సీఐగా నాగభూషణం శనివారం బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్‌కు చెందిన ఈయన చింతకొమ్మదిన్నెలో పనిచేస్తూ ప్రొద్దుటూరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ బాలమద్దిలేటి చింతకొమ్మదిన్నెకు బదిలీ అయ్యారు. రూరల్ పరిధిలోని గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని సీఐ ఈ సందర్భంగా తెలిపారు.


సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పోరుమామిళ్ల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం సగిలేరు కళాశాల ప్రిన్సిపాలుగా పని చేసిన నిరంజన్ వరప్రసాద్ పదవీ విరమణ చేయడంతో శనివారం ఆయనను పాఠశాల సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చిన్నయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 13న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి కె.సత్యకుమారి

ప్రొద్దుటూరు క్రైం : సెప్టెంబర్ 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని రెండో అదనపు జిల్లా జడ్జి కె.సత్యకుమారి తెలిపారు. కోర్టు ఆవరణలో శనివారం ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, న్యాయవాదులతో జరిగిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ కక్షిదారులతో మాట్లాడి కేసుల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి ఘన వీడ్కోలు



ఖాజీపేట : బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన భారీ గణనాథుడు



మిట్టమడి వీధిలో నిమజ్జనానికి తరలిన గణనాథుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయక చవితి రోజున వేదికపై కొలువుదీరిన గణనాథుడికి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు జరిపిన ఉత్సవ కమిటీ ప్రతినిధులు శనివారం నిమజ్జనానికి తరలించారు. మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మిట్టమడి వీధిలోని ఉత్సవ కమిటీ ప్రతినిధులు బాణసంచా, డప్పు వాయిద్యాల సందడి, మహిళల కోలాటాల మధ్య గణనాథుడి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద శ్రీరామసేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి వినాయక విగ్రహం వద్ద 2500 మందికి అన్నదానం నిర్వహించారు. పదునెట్టాంబడిపై మట్టి గణేషుడు, ఒక వైపు సుబ్రహ్మణ్యస్వామి, లక్ష్మీదేవి విగ్రహం అందరిని ఆకట్టుకుంటోంది. వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ యువతరంగం ఆధ్వర్యంలో సోలో, గ్రూప్ విభాగంలో క్లాసికల్ డాన్స్ నృత్య పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రవీంద్ర హైస్కూల్ కరస్పాండెంట్ పల్లేటి ప్రభాకర్ రెడ్డి, కమిటీ ప్రతినిధులు బహుమతులు అందచేశారు. కొన్ని ఉత్సవ కమిటీల వారు శనివారం పార్వతీ పుత్రుడిని డప్పువాయిద్యాల మధ్య రంగులు చల్లుకుంటూ రామేశ్వరం పెన్నానది, కామనూరు, చాపాడు కుందూ నదిలో నిమజ్జనానికి తరలించారు. కాగా కొన్ని వినాయక విగ్రహాలను కమిటీ వారు 5, 7, 9, 11 రోజులు పాటు పూజలు చేసి నిమజ్జనానికి తరలించనున్నారు

కోలాహలంగా వినాయక నిమజ్జనాలు

బద్వేలు అర్బన్ : పట్టణంలో ఏర్పాటు చేసిన పలు విగ్రహాలను శనివారం రాధాకృష్ణనగర్, సురేంద్రనగర్, పూసలవాడ, శివానగర్‌లలో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఆయా విగ్రహాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. యువకులు పెద్ద ఎత్తున బాణాసంచా పేలుస్తూ రంగులు చల్లుకుంటూ ఆనందంతో విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. స్థానిక రాధాకృష్ణనగర్‌లో నిమజ్జనోత్సవ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని సాగనంపారు. బద్వేలు అర్బన్ సీఐ లింగప్ప ఆధ్వర్యంలో పోలీసులు అన్ని విగ్రహాల ఊరేగింపుల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో వినాయకుడికి పూజలు

ఖాజీపేట : మండలంలో వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి గ్రామంలో భారీ గణనాథున్ని ప్రతిష్ఠించారు. మండపాలను ఎంతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పండుగ పురస్కరించుకుని ఆట, పాటల పోటీలు నిర్వహించారు. గెలిచిన వారికి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. నిమజ్జనం పురస్కరించుకుని లడ్డూ వేలం కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ వేలంలో ఏటూరు గ్రామంలో మూలే ప్రతాప్ రెడ్డి 11 కేజీల స్వామి వారి లడ్డూను రూ. 85 వేలకు దక్కించుకున్నారు. స్వామి వారి రూ. 5 బిల్లను 24 వేలకు వేలం పాడి మూల భాస్కర్‌రెడ్డి దక్కించుకున్నాడు. అలాగే చెరుకు గడెలను రూ. 6,200 వేలం పాడి మూల నాగముని రెడ్డి దక్కించుకున్నారు.

గట్టి బందోబస్తు

వినాయక నిమజ్జనం రోజు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ వంశీధర్ తెలిపారు. ఆంజనేయకొట్టాలు, చెన్నూరు పెన్నానది వంతెనపై, ఏటూరు పెన్నానది వంతెన నుంచి అలాగే కుందూ నదిలో విగ్రహాలను నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

రాజుపాళెం: వినాయక విగ్రహాల నిమజ్జనంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని రాజుపాళెం ఎస్ఐ కత్తివెంకటరమణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమానికి వెళ్లే వారంతా సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటలలోపు నిమజ్జన ప్రాంతానికి చేరుకోవాలని, బాణ సంచా పేల్చడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పగిడాలలో ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా ఊరేగింపు నిర్వహించాలని తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో పిల్లలు, మహిళలు లేకుండా చూసుకోవాలని, ఒక వేళ వచ్చినా కమిటీ సభ్యులే బాధ్యత వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు సిద్ధయ్య, రామకృష్ణారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.



రాధాకృష్ణనగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద భక్తుల సందడి

రూ.1.81 లక్షలు పలికిన వినాయకుని లడ్డు



ప్రభలవీడులో రూ.1.81 లక్షలకు దక్కించుకున్న ఓబుల్‌రెడ్డి

బి.కోడూరు : మండలంలోని ప్రభలవీడులో ఏర్పాటు చేసిన వినాయక లడ్డు వేలంపాటలో అదే గ్రామానికి చెందిన చెన్నుపల్లె ఓబుల్‌రెడ్డి రూ.1.81 లక్షలకు దక్కించుకున్నారు. కలశం చెంబును గురివిరెడ్డి దక్కించుకున్నారు. వీరిని ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించి లడ్డును అందజేశారు.

రూ.1.70 లక్షలకు లడ్డూను దక్కించుకున్న పెద్దగంగయ్య



లడ్డూను దక్కించుకున్న పెద్దగంగయ్య

అట్లూరు : కమలకూరు గ్రామంలో వినాయకుడి లడ్డూను శనివారం రూ.1.70 లక్షలకు అదే గ్రామానికి చెందిన లగసాని పెద్దగంగయ్య దక్కించుకున్నారు. చెంచుసుబ్బారెడ్డి ఏర్పాటు చేసిన 15 కిలోల లడ్డూను వేలం పాటలో ఆయన దక్కించుకున్నారు. కలశాన్ని రూ.53 వేలకు కొర్రపాటి వెంకటసుబ్బయ్య, చెరుకులు రూ.21వేలకు ఓరుగంటి నాగయ్య, ఎలగకాయలు రూ.11500లకు ఓరుగంటి నరసింహులు, మొక్కజొన్న కంకులు రూ.6,500లకు ఆరెళ్ల శ్రీను దక్కించుకున్నాడు.

దుంపలగట్టులో వినాయకుడికి రూ.1.48 లక్షల ఆదాయం



దుంపలగట్టులో గణనాథుడి లడ్డూతో రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి

ఖాజీపేట : మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామంలో కొలువుదీరిన గణనాథుడికి భక్తుల ద్వారా శనివారం రూ.1.48 లక్షల ఆదాయం లభించింది. వినాయక చవితి పురస్కరించుకుని దుంపలగట్టులో ఈ నెల 27న కొలువుదీరిన గణనాథుడికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి చెన్నూరు వద్ద గల పెన్నానదిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనానికి ముందు వినాయకుడి సన్నిధిలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో లడ్డూను రూ.71 వేలకు వైఎస్సార్ సీపీ నేత, కేసీ కెనాల్ ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి దక్కించుకోగా, రెడ్యం సునీల్‌కుమార్‌రెడ్డి రూ.40వేలకు వెండి చెంబు, డబ్బుల దండను తవ్వా సతీష్‌రెడ్డి రూ.37వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

కుచ్చుపాపలో వినాయకుడి లడ్డూ రూ.1.30 లక్షలు



చాపాడు : కుచ్చుపాపలో రూ.1.30లక్షలకు లడ్డూ దక్కించుకున్న మహేష్‌యాదవ్

చాపాడు : మండల వ్యాప్తంగా శనివారం గణనాథుడి నిమజ్జన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ క్రమంలో మండలంలోని కుచ్చుపాప గ్రామంలో జరిగిన వేడుకల్లో వినాయకుడి వద్ద గల లడ్డూ ప్రసాదానికి వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో గ్రామానికి చెందిన నంద్యాల మహేష్ యాదవ్ రూ.1.30లక్షలకు వేలం పాట పాడి వినాయకుడి లడ్డూను దక్కించుకున్నాడు. ఈ లడ్డూను ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లి భక్తులకు పంచిపెటారు. అనంతరం బాణా సంచా పేల్చుతూ, డబ్బు వాయిద్యాల నడుమ సందండిగా పెద్దగురువళూరు వద్ద గల కుందూనదిలో వినాయకుడిని నిమజ్జనం చేశారు. ఇదే క్రమంలో రాజువారిపేట గ్రామంలో కూడా వినాయకుడి నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని సీతారామాపురం గ్రామం వద్ద గల కుందూనదిలో ప్రొద్దుటూరు, మైదుకూరు ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన వందలాది వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

గోపవరం : చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాచాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ఉత్తర్వుల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ బద్వేలు ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ప్రతిఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టాలను ఏవిధంగా వినియోగించుకోవాలి, ఉచిత న్యాయసేవలు ఎలా అందుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయ సలహాలు కావాల్సిన వారు 15100కు ఫోన్ చేసి సలహాలు అందుకోవాలన్నారు. ఉచిత లాయర్‌ను ఏవిధంగా ఏర్పాటు చేసుకోవాలి, ఉచిత న్యాయ సహాయం కొరకు మండల న్యాయసేవాధికార సంస్థను ఆశ్రయించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారిని తక్కువగా చూడకుండా మానవతా విలువలను ఆచరించి మనుషులందరూ సమాజంలో సమాన జీవనశైలిని ఆచరించాలని విజ్ఞప్తి చేశారు. సదస్సులో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వి.ఎస్.ఆర్.కృష్ణ, సెక్రటరీలు మురళి, శివకుమార్, చక్రధర్, న్యాయవాదులు, బద్వేలు రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ తప్పనిసరి

బ్రహ్మంగారిమఠం : ఉద్యోగం చేసే ప్రతి వ్యక్తికీ పదవీ విరమణ తప్పని సరిగా ఉంటుందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. శనివారం బి.మఠం ఎంపీడీఓ కార్యాలయంలో పరిపాలనాఅధికారిగా పనిచేస్తున్న దుత్తా మల్లికార్జునరావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడారు. పోరుమామిళ్ల నివాసి అయినా మల్లికార్జునరావు బ్రహ్మంగారిమఠం మండల ప్రజలకు చాలా సుపరిచయుడయ్యాడు. ఇక్కడ జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పనిచేస్తూ ఎంపీడీఓ కార్యాలయం పదోన్నతి పొంది వివిధ మండలాలలో పనిచేసాడు. చివరికి బ్రహ్మంగారిమఠంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందడం హర్షణీయం అన్నారు. గతంలో ఇక్కడ పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, స్థానిక ఇన్‌చార్జీ ఎంపీడీఓ వీరకిషోర్, పదవీవిరమణ పొందిన మల్లికార్జునరావును ఘనంగా సన్మానించారు.

అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

రాజుపాళెం : ఎరువులను అధిక ధరలను విక్రయిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మైదుకూరు ఏడీఏ ఎం.కృష్ణమూర్తి, విజిలెన్స్ సీఐ బి.శివన్న హెచ్చరించారు. మండలంలోని వెలవలి, టంగుటూరు, రాజుపాళెం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను ఏవో శివరామకృష్ణారెడ్డితో కలిసి శనివారం వారు తనిఖీ చేశారు. దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులకు కనపడేట్లుగా స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని, అనుమతులున్న ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. ఎరువులను కొనుగోలు చేసినప్పుడు రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని చెప్పారు. యూరియా కృత్రిమ కొరతను సృష్టించవద్దని, రైతుల అవసరాల మేరకే యూరియా సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

• నడిరోడ్డులో గుంతలు..

పోరుమామిళ్ల : పట్టణంలోని సాయిబాబా మందిరం వద్ద నడిరోడ్డులో ఏర్పడ్డ గుంతలో పడి మోటార్‌బైకుల్లో వెళుతున్న వాహనదారులు గాయాల పాలవుతున్నారు. దీనిపై స్పందించిన మానవ హక్కుల సంఘం సభ్యులు శుక్రవారం అక్కడ నాట్లు వేసి నిరసన తెలిపారు. అయినా ఆర్‌అండ్‌బీ అధికారుల్లో, కాంట్రాక్టర్‌లో చలనం రాలేదు. శనివారం ఓ యువకుడు కిందపడి పైకి లేవలేక పోవడంతో పక్కనున్న వారు బండిని లేపి పక్కకు తెచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చి, ప్రయాణికులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



బైక్‌ను లేపి పక్కకు తెస్తున్న స్థానికులు

ఉచిత వైద్య శిబిరం పరిశీలన

బద్వేలు అర్బన్ : ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని శ్రీనివాస ఫంక్షన్ హాలులో తిరుపతికి చెందిన ఎస్.కె.డి.కనకాస్ ఆయుర్వేదిక్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆయుర్వేద మూలికలు, ఆయుర్వేద మందుల ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మన పూర్వీకులు ఆయుర్వేద వైద్యం ద్వారా ఎంతో ఆరోగ్యవంతులుగా ఉన్నారనే విషయాన్ని ప్రతిఒక్కరు గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు పుత్తాశ్రీరాములు, నాగం సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు వివేక్‌రెడ్డి, గురివిరెడ్డి, ఆయుర్వేద వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయం సద్వినియోగం చేసుకోండి

కమలాపురం: పలు కేసుల్లో జైళ్లలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప బాబాఫక్రుద్దీన్ తెలిపారు. శనివారం ఆయన కమలాపురం సబ్ జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మధుసూదన్ రావుతో కలిసి విజిట్ చేశారు. రిజిష్టర్లను పరిశీలించారు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. ఏ కేసులో జైలుకు వచ్చారు.. తదితర వివరాలపై ఆరా తీశారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను ఖైదీలకు వివరించారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

3న మండల సర్వసభ్య సమావేశం

కాశినాయన : మండల సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 3న ఎంపీపీ నల్లేరు పోలమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి హామీ పథకం, పలు సమస్యలపై సభ్యులు చర్చిస్తారని ఆమె పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

నేత్రదానంపై అవగాహన

ప్రొద్దుటూరు క్రైం : నేత్రదానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్ తెలిపారు. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మాధవీలత, ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ గోపాల్, డాక్టర్ శాంతి, కేజే రఘురామిరెడ్డి, చంద్రమౌళి, తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇమామ్-మౌజన్‌లకు వేతనం విడుదల చేయాలి

పోరుమామిళ్ల : ప్రభుత్వం ఫిబ్రవరి నుంచి ఇమామ్-మౌజన్‌ల గౌరవ వేతనం ఇంతవరకు విడుదల చేయక పోవడంతో వారంతా జీవనానికి ఇబ్బంది పడుతున్నారని మహమ్మదీయ మసీదు కమిటీ నిర్వాహకులు ఖాదర్‌బాషా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మసీదులో సేవలందించే ఇమామ్-మౌజన్‌ల వేతనం త్వరగా విడుదల చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

పెండ్లిమర్రి : ఎరువుల దుకాణాదారులు రైతులకు ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ అమ్మితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డి.సి.టి.ఓ గీతావాణి, వ్యవసాయశాఖ ఏడీఏ సురేష్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. వెల్లటూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.